# బీడు భూములను సాగులోకి తెచ్చినం

- కాళేశ్వరం ప్రాజెక్టుతో మండలాన్ని సస్యశ్యామలం చేసినం
- గెలిచిన తర్వాత సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- కథలాపూర్ మండల ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు



కథలాపూర్ మండలం సిరికొండలో యాదవ సంఘం నాయకులు బహూకరించిన గొర్రెపిల్లతో వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

కథలాపూర్, నవంబర్18: 'ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురై, సాగుకు నోచుకోని బీడు భూములను స్వరాష్ట్రంలో కేసీఆర్ సర్కారు హయాంలో సాగులోకి తెచ్చినం. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మండలాన్ని సస్యశ్యామలం చేసినం. కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ప్రాంతం అప్పుడెట్లుండె.. ఇప్పుడు ఎట్లయిందో.. ప్రజలు గమనించాలి'.. అని వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పిలుపునిచ్చారు. గడపగడపకూ గులాబీ జెండా కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డితో కలి సి కథలాపూర్ మండలంలోని పోసానిపేట, కథలాపూర్, సిరికొండ, పెగ్గెర్ల, ఊట్‌పల్లి, భూషణ్‌రావుపేట, చింతకుంట, రాజారాంతండాలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ప్రాంతం ఎలా ఉండేది.. ప్రత్యేక రాష్ట్రంలో గడిచిన తొమ్మిదిన్నర ఏండ్లలో ఎలా ఉందో ప్రజలు గమనించాలన్నారు. వరద కాలువ ద్వారా కథలాపూర్ మండలంలో 365 రోజులు నీళ్లు నిల్వ ఉండేలా చేసి, ప్రతి ఎకరానికి సాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. ఈ ఎన్నికలు కేవలం వ్యక్తుల మధ్య జరుగుతున్నవి కాదు.. తెలంగాణ భవిష్యత్ ఎట్లా ఉండాలో నిర్ణయించేవన్నారు. ఆలోచించి ఓటేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు వస్తున్న తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే.. గెలిచిన 9నెలల్లోపు సిరికొండ-తక్కళ్లపల్లి రోడ్డు నిర్మాణంతోపాటు అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో ప్రచారానికి వెళ్లిన చల్మెడకు స్థానిక మహిళలు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. గొల్లకురుమలు గొర్రె పిల్లను బహూకరించి అభిమానాన్ని చాటుకున్నారు. పోసానిపేటలో పలువురు యువతులతో చల్మెడ ఆప్యాయంగా మాట్లాడి, ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న పథకాలను వివరించారు. కారు గుర్తు కు ఓటు వేసేలా గ్రామస్తులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ జవ్వాజి రేవతి-గణేశ్, వైస్‌ఎంపీపీ కిరణ్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, ఏఎంసీ చైర్మన్ గుండారపు సౌజన్య-గంగాధర్, వైస్ చైర్మన్ సోమ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చుక్కా దేవరాజం, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ కేతిరెడ్డి మహిపాల్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు భూమారెడ్డి పాల్గొన్నారు.



సిరికొండలో బీఆర్ఎస్ మ్యానిఫెస్టో, ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్న మహిళలు

# నిండుమనసుతో రామన్నను ఆశీర్వదించండి

- గులాబీ జెండానే తెలంగాణకు శ్రీరామరక్ష
- కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలే
- వీర్నపల్లి, బాబాయిచెరువుతండా ఎన్నికల ప్రచారంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు
- మహిళల భారీ ర్యాలీ



వీర్నపల్లిలో మాట్లాడుతున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

వీర్నపల్లి, నవంబర్18: గులాబీ జెండా నీడలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, మరోసారి సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్‌ను నిండుమనసుతో ఆశీర్వదించాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో మంత్రి కేటీఆర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు కమటం నాగరాజు ఆధ్వర్యంలో మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొండూరి మాట్లాడుతూ, గులాబీ జెండానే తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు మళ్లీ వస్తాయని, బీజేపీ వస్తే కులాలు, మతాల మధ్య మంటలు చెలరేగుతాయన్నారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. కేసీఆర్ పాలనలో పల్లెలు ప్రగతిపథంలో పయనిస్తున్నాయని చెప్పారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడంతో వారికే పాలన అవకాశం కల్పించారన్నారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరా రు.

## తల్లులకు సత్కారం



తల్లులను సత్కరిస్తున్న డీఎంహెచ్‌వో, ఒయాసిస్ వైద్యులు

విద్యానగర్, నవంబర్ 18: హార్మోన్ ఇన్‌బ్యాలన్స్‌తో 60 శాతం మంది బాధపడుతున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ లలితా దేవి పేర్కొన్నారు. ఈ సమస్యకు ఆదిలోనే చికిత్స తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కరీంనగర్‌లోని ఒయాసిస్ ఫెర్టిలిటీలో ఐవీఎఫ్ ద్వారా గర్భం దాల్చిన తల్లులను శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒయాసిస్‌లో 73 శాతం సక్సెస్ రేటు ఉండటం అభినందించదగ్గ విషయమన్నారు. నాణ్యమైన చికిత్స అందించడం ముఖ్యమన్నారు. కరీంనగర్‌లో 13 ఐవీఎఫ్ కేంద్రాలు ఉన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఒయాసిస్ ఫెర్టిలిటీ, కన్సల్టెంట్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ జిగ్నా తమగొండ్ మాట్లాడుతూ, ఒయాసిస్‌లో అధునాతన సంతానోత్పత్తి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. జీరో స్పెర్మ్ కౌంట్ ఉన్న పురుషులు పితృత్వాన్ని సాధించడంలో మైక్రోటీస్ (మైక్రోసర్జికల్ టెస్టిక్యులర్ స్పెర్మ్ ఎక్స్ (ట్రాక్షన్) వంటి అధునాతన పద్ధతులను అందిస్తున్నామని పేర్కొన్నారు.

# ఘనంగా స్వయం పాలన దినోత్సవం



పాఠం బోధిస్తున్న విద్యార్థిని

కమాన్‌చౌరస్తా, నవంబర్ 18: జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో గల బ్లూబెల్స్ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వారం రోజులుగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులను విజ్ఞాన విహార యాత్రకు తీసుకెళ్లారు. విద్యార్థులు ఉజ్వల పార్కు, రైల్వే స్టేషన్, ప్రియా డెయిరీ, ఆలయాలను సందర్శించారు. అలాగే, ఆఖరు రోజు పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం నిర్వహించగా, విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ప్రిన్సిపాల్ జంగ సునీత-మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 'మానేరు'లో అలరించిన బ్లాక్ అండ్ వైట్ డే



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

కొత్తపల్లి, నవంబర్ 18: కరీంనగర్‌లోని మానేరు పాఠశాలలో శనివారం బ్లాక్ అండ్ వైట్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను నలుపు, తెలుపు రంగులతో అందంగా అలంకరించారు. నలుపు, తెలుపు రంగులతో కూడిన వస్తువులను సేకరించి ముస్తాబు చేశారు. విద్యార్థులు తెలుపు, నలుపు రంగు దుస్తులతో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ, ప్రీ ప్రైమరీ విద్యార్థులకు నలుపు, తెలుపు రంగులపై అవగాహన కల్పించేందుకే ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు నలుపు, తెలుపు రంగుల విశిష్టతను వివరించారు. ఈ వేడుకల్లో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణతో నైపుణ్యాలు మెరుగు

ముకరంపుర, నవంబర్ 18: శిక్షణ ద్వారా ఉద్యోగుల నైపుణ్యం మరింత మెరుగుపడుతుందని ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వీ గంగాధర్ పేర్కొన్నారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల సర్కిళ్లలోని జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు 157మందికి కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఎస్ఈ శనివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం అంతా ఆన్ లైన్‌లో నిర్వహిస్తున్నందున ప్రతి ఉద్యోగి సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. శిక్షణలో భాగంగా అడ్మినిస్ట్రేషన్, ఎంక్వైరీ, క్రమశిక్షణ చర్యలు, ఆన్‌లైన్ అకౌంట్స్, రెవెన్యూ, వ్యయం, కార్యాలయ పనులను త్వరగా పూర్తి చేసే విధానాలపై శిక్షకులు ఉద్యోగులకు అవగాహన కల్పించారు. వరంగల్ కార్యాలయ జీఎం మనోహర స్వామి, ఏవో నాగేశ్వరరావు శిక్షణ తరగతులను నిర్వహించారు. డీఈలు విజయేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, ఎస్ఏవో రాజేశం, పీవో చంద్రయ్య, ఏవోలు అరవింద్, రాజేంద్రప్రసాద్, ఏడీఈలు ఏఏవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# నేతన్నల జీవితాల్లో వెలుగులు

- యారన్ సబ్సిడీ విడుదలపై హర్షం
- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్
- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

సిరిసిల్ల టౌన్, నవంబర్ 18: మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో నేతన్నల జీవితాల్లో వెలుగులు నిండుకున్నాయని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ పేర్కొన్నారు. నేత కార్మికులకు బతుకమ్మ చీరల యారన్ సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేయడాన్ని స్వాగతిస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటానికి బీఆర్‌టీయూ నేతలు పాలాభిషేకం చేశారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత అడ్డగట్ల మురళి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం నేతన్నల సంక్షేమం కోసం వ్యక్తిగత రుణాలను మాఫీ చేసిందని గుర్తు చేశారు. 2021 సంవత్సరానికి సంబంధించిన 10 శాతం యారన్ సబ్సిడీ రూ.8.77 కోట్లు దాదాపు 5,128 మంది కార్మికుల ఖాతాల్లో జమచేశారని తెలిపారు. అమాత్యుడి చొరవతో కార్మికుల జీవన స్థితిగతుల్లో వచ్చిన మార్పులను గమనించాలన్నారు. నాడు ఉపాధి లేక వలస వెళ్లిన కార్మికులు.. నేడు సిరిసిల్లకు వచ్చి ఉపాధి పొందుతున్నారని స్పష్టం చేశారు. సిరిసిల్లను సిరులఖిల్లాగా మార్చిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. సిరిసిల్లలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటుతోనే బీజేపీ, కాంగ్రెస్‌లకు సమాధానం చెప్పాలన్నారు.